క్లుప్తంగా

డ్వాక్రా మహిళలకు అవగాహన

అశ్వాపురం: మండల పరిధిలోని మొండికుంట గ్రామపంచాయతీ కార్యాలయంలో ఐటీసీ సంస్థ చేయూతతో మమత ఎన్‌జీఓ వారు ప్లాస్టిక్ నిర్మూలన, మాతా శిశు సంరక్షణపై డ్వాక్రా మహిళలకు మంగళవారం అవగాహన కల్పించారు. ప్రత్యేక అధికారి, తహసీల్దార్ స్వర్ణలత, ఎంపీటీసీ కమటం నరేష్, పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్‌కు, మహిళలకు జ్యూట్ బ్యాగ్స్ అందజేశారు. ప్లాస్టిక్ నిర్మూలన, మాతా శిశుసంరక్షణ, ఎనీమియా, పౌష్టికాహార లోపం గురించి అవగాహన కల్పించి మహిళా సంఘాల సభ్యులకు తెలియజేయాలని సూచించారు. ఐటీసీ మమత ఎన్‌జీఓ జిల్లా కోఆర్డినేటర్ అనిల్, సిబ్బంది, పాఠశాల హెచ్‌ఎం కనకమహాలక్ష్మి, వీఓఏలు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

కూలీలను విడుదల చేసిన మావోయిస్టులు

దుమ్ముగూడెం: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని సుకుమా జిల్లాలో మావోయిస్టులు కిడ్నాప్ చేసిన కూలీలను మంగళవారం క్షేమంగా విడుదల చేశారు. జల్ జీవన్ మిషన్ పనుల నిమిత్తం వెళ్లిన నలుగురు కూలీలను జేగురుగొండ ప్రాంతానికి చెందిన మావోయిస్టులు ఆదివారం సాయంత్రం కిడ్నాప్ చేసిన సంగతి తెలిసిందే. కాగా కూలీల కుటుంబ సభ్యుల విజ్ఞప్తి మేరకు మావోయిస్టులు కూలీలను విడుదల చేయడంతో కుటుంబసభ్యులు సంతోషం వ్యక్తం చేశారు.

'గృహజ్యోతి'కి వివరాలు సేకరణ

అశ్వారావుపేటరూరల్: మండలంలోని పేరాయిగూడెం, కొత్త పేరాయిగూడెం, మోడల్ కాలనీతోపాటు పలు గ్రామాల్లో మంగళవారం విద్యుత్ శాఖ అధికారులు వివరాలు సేకరణ చేపట్టారు. స్థానిక ఆ శాఖ అధికారులు, సిబ్బంది ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీల హామీల్లో భాగంగా 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకాన్ని అమలు చేసేందుకు లబ్ధిదారుల వద్ద నుంచి ఆధార్ కార్డు, రేషన్ కార్డు, సెల్‌ఫోన్ నంబరు, ప్రజా పాలన గ్రామసభల్లో పొందిన దరఖాస్తు క్రమ సంఖ్య నంబర్లను సేకరించి నమోదు చేసుకున్నారు. మండల కోఆప్షన్ సభ్యుడు ఎస్‌కె.పాషా పాల్గొన్నారు.

నేడు సామూహిక అక్షరాభ్యాసం

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణం కూనవరం రోడ్‌లోని శ్రీ సరస్వతి శిశు మందిర్ ఆవాస విద్యాలయంలో సరస్వతి మాత పుట్టిన రోజు సందర్భంగా చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పాఠశాల అధ్యక్షుడు పాకాల దుర్గాప్రసాద్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో వారు పాల్గొనే వారు చిన్నారులకు పసుపు, కుంకుమ, పలక, బలపం, కొబ్బరి కాయ, పూలు, పండ్లు, అగరుబత్తీలు, కర్పూరం, గంధం, రెండు కిలోల బియ్యంతో హాజరు కావాలని ఆయన సూచించారు.

ఆర్థిక సాయం

అశ్వాపురం: మండల పరిధిలోని మల్లెలమడుగు గ్రామానికి చెందిన పాదాల సత్యనారాయణ ఇటీవల మృతి చెందగా నిరుపేద కుటుంబం కావడంతో దశదిన కార్యక్రమాల ఖర్చులకు మున్నూరుకాపు సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం రూ.7,116 ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్నూరుకాపు సంఘం మండల అధ్యక్షుడు కమటం వెంకటేశ్వరరావు, నాయకులు సుంకరి సురేందర్, ఆవుల రవి, కమటం సురేష్, రాగం మల్లయ్య, పర్వత నరేష్, బచ్చు వెంకటరమణ, తులసి వెంకటరమణ, మానాది వెంకన్న, సైదులు, కమటం సైదులు, రాజేష్, రమేష్, సాంబయ్య, రాము పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

అశ్వాపురం: మండల పరిధిలోని మొండికుంట గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న సీతారామ చంద్రస్వామి ఆలయం నిర్మాణానికి గ్రామానికి చెందిన జ్యోతిష్యం, వాస్తు శాస్త్రంలో డాక్టరేట్‌తో పాటు ఎన్నో అవార్డులు పొందిన పదిరావూరి శ్రీనివాసాచారి మంగళవారం రూ.50,116 విరాళంగా అందజేశారు. శ్రీనివాసాచారిని ఆలయ నిర్మాణ కమిటీ వారు అభినందించి సన్మానించారు.

దాడి అమానుషం

భద్రాచలంఅర్బన్: అచ్చంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ అరుణపై రైతులు దాడి చేయడం అమానుషమని జిల్లా ఆర్య వైశ్య మహాసభ అధ్యక్షుడు చారుగుళ్ల శ్రీనివాస్ అన్నారు. మహిళ అని కూడా చూడకుండా రోడ్డు మీదకు ఈడ్చుకుని వెళ్లడం సభ్య సమాజం సిగ్గుపడే చర్యగా ఆయన అభివర్ణించారు. ఆర్య వైశ్యులు మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ఉండడాన్ని కొందరు జీర్ణించుకోలేక ఇలాంటి అమానుష చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఇలాంటివి పునరావృతం కాకుండా ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని, దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేసి వారిపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. దాడిని ఖండించిన వారిలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి, కోశాధికారులు పల్లెర్ల చంద్రశేఖర్, చింతల వినోద్ కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు, కార్యదర్శి దోసపాటి వెంకటేశ్వరరావు, అత్తలూరి ఉమ రాష్ట్ర, జిల్లా నాయకులు ఉన్నారు.

విస్తరణకు నోచుకోని రహదారి

- ఇరుకుగా అశ్వాపురం ప్రధాన రోడ్డు
- సింగరేణి, థర్మల్ పవర్ వాహనాలు ఈ దారిగుండానే ప్రయాణం
- తరచుగా చోటుచేసుకుంటున్న ప్రమాదాలు



మండల కేంద్రంలో అధ్వానంగా ఉన్న ప్రధాన రహదారి

అశ్వాపురం: పారిశ్రామికంగా, ప్రాజెక్టులతో అభివృద్ధి చెందుతున్న అశ్వాపురం మండల కేంద్రంలో ప్రధాన రహదారి విస్తరణ లేదు. దీంతో మండల కేంద్రంలో వ్యాపారులు, ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రంలో ప్రధాన రహదారికి ఇరువైపులా డ్రెయినేజీ, సెంట్రల్ లైటింగ్, రహదారి విస్తరణకు డీఎంఎఫ్‌టీ నిధులు రూ.4 కోట్లతో పనులు చేపట్టారు. డ్రెయినేజీ పనులు పూర్తయి నెలలు గడుస్తున్నా రహదారి విస్తరణ పనులు మాత్రం చేపట్టడం లేదు.

కర్మాగారాలకు ఇదే దారి..

అశ్వాపురం మండల కేంద్రంలో రహదారి విస్తరణ చాలా అవసరం. అశ్వాపురంలో భారజల కర్మాగారం, మణుగూరులో భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్, సింగరేణి, మండలంలో సీతారామ ప్రాజెక్ట్, సీతమ్మ సాగర్ బహుళార్థసాధక ప్రాజెక్ట్‌లకు సంబంధించిన వాహనాలు, యంత్రాలు ఈ రహదారి గుండా వెళ్లాలి. భారజల కర్మాగారం, ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌లతో అశ్వాపురంకు ఎంతో ప్రాధాన్యత ఉంది. ప్రధాన రహదారిపై వాహనాల రద్దీ ఎక్కువగా ఉండటంతో రెండు వరుసల రహదారితో స్థానికులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రహదారి ఇరుకుగా ఉండి వాహనాల రద్దీతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. సెంట్రల్ లైటింగ్, డివైడర్లు ఏర్పాటు చేస్తే రహదారి మరింత చిన్నగా అవుతుంది.

అంతా గుంతలమయం..

మండల కేంద్రంలో ప్రధాన సెంటర్‌లో మణుగూరు–కొత్తగూడెం ప్రధాన రహదారి గుంతలమయమై వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రహదారి గుంతలు గుంతలుగా ఉండి రహదారిపై ప్రయాణించాలంటే వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. ఇటీవల పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు రహదారికి మరమ్మతులు చేపట్టాలని ఆర్‌అండ్‌బీ అధికారులను ఆదేశించినా అధికారులు కన్నెత్తి కూడా చూడటం లేదు. మేడారం జాతర సందర్భంగా రహదారిపై వాహనాల రద్దీ అధికం కావడంతో ప్రయాణికులు, స్థానికులు ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో అని భయాందోళన చెందుతున్నారు. దీనిపై స్థానిక ఎమ్మెల్యే చొరవ తీసుకోవాలని, ఆర్‌అండ్‌బీ అధికారులు తక్షణమే స్పందించి రహదారి కి మరమ్మతులు చేపట్టాలని ప్రయాణికులు, స్థానికులు కోరుతున్నారు.

రహదారిని విస్తరించాలి



అశ్వాపురంలో ప్రధాన రహదారి నిత్యం వాహనాలతో రద్దీగా ఉంటుంది. రహదారి రెండు వరుసల రహదారి కావడంతో వాహనాల రద్దీతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రమాదాలు జరుగుతున్నాయి. వెంటనే ప్రధాన రహదారిని విస్తరించాలి.

– కూరపాటి శ్రీనివాసరావు, భారజల కర్మాగారం ఉద్యోగ సంఘం అధ్యక్షుడు

పనులు తక్షణమే చేపట్టాలి



అశ్వాపురంలో ప్రధాన రహదారి ఇరుకుగా ఉండి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పారిశ్రామికంగా, ప్రాజెక్టులతో దినదినాభివృద్ధి చెందుతున్న అశ్వాపురంలో రహదారి విస్తరించకపోవడం బాధాకరం. రహదారి విస్తరణ సమస్యపై మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులకు ఎన్నో ఏళ్లుగా విన్నవిస్తున్నాం. రహదారి విస్తరణ పనులు చేపట్టాలి.

– బాణోత్ శారద, మాజీ సర్పంచ్ అశ్వాపురం

ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తాం..



మండల కేంద్రంలో ప్రధాన రహదారి విస్తరించకపోవడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. రహదారి విస్తరణ సమస్యను ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు దృష్టికి తీసుకెళ్తాం. ప్రభుత్వంతో మాట్లాడి రహదారి విస్తరణ పనులు చేపట్టేలా చొరవ తీసుకోవాలని ఎమ్మెల్యేను కోరుతాం.

– ముత్తినేని సుజాత, అశ్వాపురం ఎంపీపీ

బాధ్యతలు చేపట్టిన సీఐ వెంకటేశ్వర్లు



సీఐ వెంకటేశ్వర్లు



ఎస్సై సుమన్

భద్రాచలంఅర్బన్: భద్రాచలం టౌన్ సీఐగా రాయల వెంకటేశ్వర్లు మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న సీఐ నాగరాజు రెడ్డి వీఆర్‌కు పంపడంతో ఆ స్థానంలో వెంకటేశ్వర్లుని నియమించారు. ఈ సందర్భంగా సీఐ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ శాంతి భద్రతల విషయంలో రాజీలేకుండా పని చేస్తామన్నారు. బాధ్యతలు స్వీకరించిన సీఐకు ఎస్ఐలు మధుప్రసాద్, పీవీఎన్ రావు, విజయలక్ష్మి, స్టేషన్ సిబ్బంది అభినందనలు తెలిపారు.

అందరి సమన్వయంతో విధులు..

అందరి సమన్వయంతో విధులు నిర్వర్తించానని బదిలీ అయిన సీఐ నాగరాజురెడ్డి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. రెండేళ్ల కాలంలో చేపట్టిన ప్రతీ కార్యక్రమానికి పోలీసు సిబ్బందే కాకుండా ప్రజలు సహకరించారని పేర్కొన్నారు. వరదల సమయంలో విధులు, ఎన్నికల విధులు సంతృప్తినిచ్చాయని తెలిపారు.

ఎస్సై సుమన్..

బూర్గంపాడు: బూర్గంపాడు పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌ఓగా ఎస్సై సుమన్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఎస్‌హెచ్‌ఓగా పనిచేసిన ఎస్సై రాజ్‌కుమార్ బదిలీపై వెళ్లారు. బదిలీపై ఇక్కడకు వచ్చిన ఎస్సై సుమన్ మాట్లాడుతూ.. శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలంతా సహకరించాలని కోరారు.

బంద్‌ను జయప్రదం చేయండి


గుండాల: ఈ నెల 16న జరిగే గ్రామీణ భారత్ బంద్‌ను జయప్రదం చేయాలని కోరుతూ మంగళవారం మండలంలోని శెంబూనిగుడేం గ్రామంలో న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఏఐకేఎంఎస్ మండల కార్యదర్శి బచ్చల సారయ్య మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, ప్రధాని నరేంద్ర మోదీ రైతాంగ వ్యతిరేక, కార్మిక వ్యతిరేక చట్టాలను తీసుకొచ్చి కార్మికులను, కర్షకులను అణచివేస్తున్నారని, ఈ కుట్రలకు వ్యతిరేకంగా దేశ ప్రజలందరూ బంద్‌లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కల్తీ మల్లయ్య, కోర్స బుచ్చయ్య, తొప్పెట్ల రాములు, కుంజ రవీందర్, కల్తీ రమేష్,సర్వయ్యా, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మణుగూరుటౌన్: ఈ నెల 16న దేశవ్యాప్తంగా కార్మిక సంఘాలు, జేఏసీ తలపెట్టిన సార్వత్రిక సమ్మెకు అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని అఖిలపక్ష పార్టీల నాయకులు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక సీపీఐ పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మిక హక్కులను కాలరాస్తూ 44 చట్టాలను రద్దు చేసిందని అన్నారు. ఇలాంటి బీజేపీ విధానాలను ఎండగడుతూ సమ్మె చేపడుతున్నట్లు తెలిపారు. సమావేశంలో అఖిలపక్ష నాయకులు అయోధ్య, ఆర్.లక్ష్మీనారాయణ, వెలగపల్లి జాన్, నాగేశ్వరరావు, శివ, మిడిదొడ్ల నాగేశ్వరరావు, జానయ్య, సుధాకర్, రాయల భిక్షం, వెంకటేశ్వర్లు, మంగి వీరయ్య, కుటుంబరావు, కంప రవి, కొత్తపల్లి సీతారాములు, బొల్లం రాజు తదితరులు ఉన్నారు.



మణుగూరుటౌన్: అఖిలపక్ష సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ నాయకుడు అయోధ్య

బీజేపీ బాధ్యుల నియామకం



మణుగూరురూరల్: వెంకటేశ్వరరావుకు నియామకపత్రం అందజేస్తున్న రంగాకిరణ్

మణుగూరురూరల్: భారతీయ జనతా పార్టీ జిల్లా కార్యదర్శిగా ముత్యాల వెంకటేశ్వరరావు నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం పార్టీ జిల్లా అధ్యక్షులు కేవీ రంగాకిరణ్ చేతుల మీదుగా నియామకపత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. తనపై నమ్మకం ఉంచి జిల్లా కార్యదర్శిగా నియమించిన జిల్లా అధ్యక్షుడికి, రాష్ట్ర నాయకత్వానికి ధన్యవాదాలు తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు.

మండల అధ్యక్షుడిగా చంద్రశేఖర్..

అశ్వారావుపేటరూరల్: భారతీయ జనతా పార్టీ అశ్వారావుపేట మండల నూతన అధ్యక్షుడిగా బండారు చంద్రశేఖర్‌ను మంగళవారం ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కేవీ రంగాకిరణ్ నియమించారు. ఈ మేరకు జిల్లా అధ్యక్షుడి చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా నూతన మండల అధ్యక్షుడు మాట్లాడుతూ.. మండలంలో పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని, అన్ని వర్గాల్లోకి పార్టీని విస్తరిస్తానని అన్నారు. తనపై నమ్మకంతో పార్టీ రాష్ట్ర, జిల్లా బాధ్యులు అప్పగించడం పట్ల కృతజ్ఞతలు తెలియజేశారు.

బాల కిరణ్..

అన్నపురెడ్డిపల్లి: బీజేపీ మండలాధ్యక్షుడిగా పెంట్లం గ్రామానికి చెందిన దేవి బాలకిరణ్ శర్మ నియమితులయ్యారు. మంగళవారం ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కేవీరంగా కిరణ్ కొత్తగూడెంలో దేవిబాల కిరణ్‌శర్మను మండలాధ్యక్షుడిగా నియమిస్తూ, నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీ బలోపేతానికి కృషి చేస్తానని అన్నారు.

మాజీ వైస్ ఎంపీపీ మృతి

దమ్మపేట: మండల బీఆర్‌ఎస్ నాయకుడు, మాజీ వైస్ ఎంపీపీ జోనెబోయిన రాంబాబు మంగళవారం గుండెపోటుతో మృతి చెందారు. మండలంలోని ముష్టిబండ గ్రామానికి చెందిన జోనెబోయిన రాంబాబు మంగళవారం అదే గ్రామంలోని తన వ్యవసాయ క్షేత్రంలోకి పనుల నిమిత్తం వెళ్లారు. వ్యవసాయ క్షేత్రంలో ఉండగానే మధ్యాహ్న సమయంలో అకస్మాత్తుగా గుండెపోటు వచ్చింది. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు ఆయనను సత్తుపల్లి ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. ఆయన మృతి పట్ల పలువురు ప్రజా ప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, గ్రామస్తులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.

విద్యుత్ తీగలు అమర్చితే కఠిన చర్యలు

గుండాల: అడవి జంతువులను వేటాడడం కోసం ఎవరైనా విద్యుత్ తీగలను అమర్చితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని గుండాల సీఐ రవీందర్, ఎస్సై రాజశేఖర్‌లు హెచ్చరించారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఇదివరకే గ్రామ సర్పంచ్‌లు, అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడినట్లు తెలిపారు. విద్యుత్ తీగలు అమర్చడం వల్ల పొలం పనులకు వెళ్లే రైతులు, మేతకు వెళ్లే పశువుల ప్రాణాలు కోల్పోతారని అన్నారు. గ్రామాల్లోని వేటగాళ్లు ఇలాంటి చర్యలు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎవరైనా తీగలు అమర్చినట్లు తెలిస్తే పోలీసులకు సమాచారం అందించాలని, వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని అన్నారు.

బీమా చెక్కు పంపిణీ

చండ్రుగొండ: మండలకేంద్రం చండ్రుగొండలోని డీసీసీబీ బ్యాంక్ నుంచి బాధితురాలికి మంజూరైన బీమాచెక్కు రూ.2 లక్షలు మంగళవారం పంపిణీ చేశారు. అన్నపురెడ్డిపల్లికి చెందిన పోతుగంటి బాలాజీ ఇటీవల మృతి చెందాడు. నామిని అయిన అతడి భార్య పోతుగంటి లక్ష్మికి బ్యాంకు మేనేజర్ రాగమయి బీమా చెక్కును అందించారు. కార్యక్రమంలో బ్యాంకు అధికారులు పూర్ణచందర్, ప్రియాంక, సృజన పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

మణుగూరురూరల్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలోని కొండాపురం భూగర్భగనిలో పని చేస్తున్న కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను సింగరేణి యాజమాన్యం పరిష్కరించాలని ఐఎన్‌టీయూసీ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు వి.కృష్ణంరాజు కోరారు. మంగళవారం ఆయన గనిని సందర్శించి కార్మికులతో మాట్లాడి నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సమస్యలపై గని అధికారులతో సమావేశమై చర్చించారు. కార్మిక సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం గని ఫిట్ సేఫ్టీ కమిటీ, మైనింగ్ కమిటీ వివరాలతో కూడిన పత్రాలను అధికారులు వీరభద్రరావు, బి.వెంకటేశ్వర్లు, ఆర్.మధులకు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు రామారావు, పి.రామకృష్ణ, వర్క్‌మెన్ ఇన్స్‌పెక్టర్ జీవీ సురేష్‌బాబు, ఏ.దుర్గా ప్రసాద్, అజ్మీరా వెంకటేశ్వర్లు, టి.వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవంపై సమీక్ష సమావేశం

అన్నపురెడ్డిపల్లి: మండల కేంద్రంలోని భ్రమరాంబ సమేత మల్లిఖార్జున స్వామి ఆలయంలో వచ్చే నెలలో నిర్వహించే మహాశివరాత్రి ఉత్సవంపై తహసీల్దార్ జగదీశ్వర ప్రసాద్ అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ వివిధ శాఖల అధికారులకు ఉత్సవ ఏర్పాట్లపై పలు సూచనలు చేశారు. ఉత్సవ ఏర్పాట్లను సకాలంలో పూర్తి చేయాలని, జాతరకు వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండ జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఆలయ మేనేజర్ వెంకటరమణ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తహసీల్దార్ జగదీశ్వర ప్రసాద్

జేఈఈలో గురుకుల బాలికల హవా

భద్రాచలంటౌన్: భద్రాచలం గిరిజన గురుకుల కళాశాల బాలికలు జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో హవా ప్రదర్శించారు. కళాశాల నుంచి 35 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 18 మంది మెయిన్స్‌కు అర్హత పొందారు. ఇందులో డి.ఐశ్వర్య 79.65, కె.శ్రావణి 74.57, ఇర్పా స్వాంజిత 68.2, టి.సింధు 67.83 శాతం ఫలితాలు సాధించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ దేవదాసు, అధ్యాపక బృందం విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

సత్తాచాటిన 'లిటిల్ ఫ్లవర్స్'..

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని లిటిల్ ఫ్లవర్స్ బాలికలు జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో సత్తాచాటి ఉత్తమ ర్యాంకులను కైవసం చేసుకున్నారు. ఐఐటీ ప్రవేశం కోసం జేఈఈ మెయిన్స్ పరీక్షకు హాజరైన కేలోత్ సాహితి 76.75 శాతం, భూక్య నిహారిక 57.39 శాతం మార్కులు కైవసం చేసుకుని ఐఐటీ సీట్లు సాధించారు. ఈ సందర్భంగా మంగళవారం లిటిల్ ఫ్లవర్స్ విద్యాసంస్థల డైరెక్టర్ మాగంటి ప్రసాద్ బాబు, రమేష్ బాబు అభినందించారు.

కలివేరులో వైద్య శిబిరం



కలివేరు గ్రామంలో ద్రావణం చల్లుతున్న వైద్య సిబ్బంది

చర్లరూరల్: కలివేరు గ్రామంలో వైరల్ జ్వరాలు విజృంభించడంతో రెండు రోజులుగా వైద్య శిబిరాలను కొనసాగిస్తున్నారు. సత్యనారాయణపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిని దివ్య నయన ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అవగాహన కల్పించారు. దోమతెరలను కట్టుకోవాలని, కాచి చల్లార్చిన నీటినే తాగాలని సూచించారు. నీటి నిల్వలలో యాంటీ లార్వల్ (తేమీఫోస్) ద్రావణం చల్లుతూ.. దోమలు గుడ్లు పెట్టి పెరగకుండా నీటి గోళాలపై మూతలు పెట్టుకోవాలని సూచించారు. అనంతరం వైద్య శిబిరంలో వైద్య పరీక్షలు నిర్వహించి వారికి కావలసిన మందులను అందజేశారు. గ్రామంలో చికెన్ గున్యా కేసులు ఎక్కువగా ఉన్నట్లు గుర్తించామని వైద్య సిబ్బంది తెలిపారు. కార్యక్రమంలో డీపీఎంఓ సత్యనారాయణ, సబ్ యూనిట్ ఆఫీసర్ హనుమంతు,మలేరియా టెక్నికల్ సూపర్ వైజర్ రామకృష్ణ, మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్ సంధ్య, హెల్త్ అసిస్టెంట్లు వేణు, సుజాత, విజయ, లక్ష్మి, ఆశా కార్యకర్తలు ఉమాదేవి, లక్ష్మీబాయి, అనూష, వరలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి సోడి స్రవంతి పాల్గొన్నారు.

బదిలీ తహసీల్దార్‌కు సన్మానం



చండ్రుగొండ: సాదియాసుల్తానాను సన్మానిస్తున్న కార్యాలయ సిబ్బంది, మైనారిటీ నాయకులు



బూర్గంపాడు: మాధవిని సన్మానిస్తున్న అంబేడ్కర్ కాలనీ వాసులు

చండ్రుగొండ: బదిలీ అయిన తహసీల్దార్ సాదియా సుల్తానాను కార్యాలయంలో మంగళవారం ఘనంగా సన్మానించారు. కార్యాలయ అధికారులు, సిబ్బంది శాలువాలు, పూలమాలలతో సత్కరించి వీడ్కోలు పలికారు. మరోవైపు, స్థానిక ముస్లిం మైనారిటీల ఆధ్వర్యంలోనూ తహసీల్దార్ సాదియా సుల్తానాను సన్మానించారు. శాలువా కప్పి సత్కరించారు. కార్యక్రమాల్లో డిప్యూటీ తహసీల్దార్ ప్రసన్న, రఘు, శ్రీను, పాష, సైదా, పద్మ, ముస్లింమైనారిటీ నాయకులు ఎస్‌కె.యాకుబ్‌అలీ, యండి.నాబీద్, ఎస్‌కె.సాబీర్, యండి.షబ్బీర్, రహీంసాబ్, అహెమద్, అజ్గర్‌అలీ, అతీఖ్ పాల్గొన్నారు.

ఉద్యోగం సాధించడంపై సన్మానం..

బూర్గంపాడు: ఇటీవల తెలంగాణ ప్రభుత్వం విడుదల చేసిన నర్సింగ్ ఫలితాల్లో బూర్గంపాడులోని అంబేడ్కర్ కాలనీకి చెందిన కేసుపాక మాధవి నర్సింగ్ ఆఫీసర్‌గా ఎంపికవగా.. మంగళవారం బూర్గంపాడులో స్థానికులు ఆమెను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నిరుపేద కుటుంబంలో జన్మించిన తాను.. అనేక కష్టానష్టాలతో చదువులు కొనసాగించానన్నారు. లక్ష్యాలను చేరుకోవటానికి పేదరికం అడ్డుకాదని ఆమె స్పష్టం చేశారు. కార్యక్రమంలో స్థానికులు కేసుపాక పుల్లయ్య, రఘురాం, డాక్టర్ మహేష్, రాజేష్, తోకల నాగరాజు, తోకల రాము, కడారి శ్రీను, అలవాల దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

వ్యాధులపై అవగాహన

అశ్వారావుపేటరూరల్: మండలంలోని వినాయకపురం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం పలు రకాల వ్యాధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైఆర్‌జీకేఆర్ లింక్ వర్కర్ స్వప్న మాట్లాడుతూ.. ఎయిడ్స్, క్షయ వ్యాధులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని అన్నారు. ఆయా వ్యాధుల బారిన పడిన బాధితులకు ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉచితంగా వైద్య సేవలు అందించి, అవసరమైన మందులను అందిస్తారని చెప్పారు. వ్యాధులపై నిర్లక్ష్యం చేసి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

బోరుకు మరమ్మతులు

ములకలపల్లి: బోరు పాడవడంతో ఆరు నెలలుగా ఊటచెరువు గొత్తికోయలు తాగునీటికి ఇబ్బందులు పడుతుండగా.. మండలవాసి, కారేపల్లి ఎస్సై పుష్పాల రామారావు రూ.5వేల సొంత ఖర్చులతో బోరుకు మరమ్మతులు చేయించారు. తాళ్లపాయ జీపీలోని ఊటచెరువు గుంపులో తాగునీరందించే చేతిపంపు మరమ్మతులకు గురైంది. దీంతో గత ఆరునెలలుగా తాగునీరు దొరక్క వాగులు, చెరువుల నుండి నీళ్లు తెచ్చుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఇటీవల గ్రామాన్ని సందర్శించిన ఎస్సై రామారావుకు స్థానికులు సమస్యను విన్నవించారు. స్పందించిన ఆయన మరమ్మతులు చేయించి మంగళవారం వినియోగంలోకి తీసుకొచ్చారు.

ప్రయాణం ఇలా.. భద్రత ఎలా?



ఆటోలో కిక్కిరిసి ప్రయాణిస్తున్న దృశ్యం..

చర్ల: బస్సులు నడిచేందుకు అనువుగా రోడ్లు ఉన్నప్పటికీ ఆర్టీసీ అధికారులు బస్సులను నడపకపోవడంతో ప్రజలు ఆటోలలో సాగించే ప్రయాణం ప్రాణాలతో చెలగాటంగా ఉంది. గమ్యస్థానాలకు చేరేందుకు ఆటోలు తప్ప మరొక దిక్కు లేకపోవడంతో ఇలా ప్రాణాలను అరచేతుల్లో పెట్టుకుని ప్రజలు వారి ప్రయాణాలను సాగిస్తున్నారు. ఆదివారం వారపు సంత కావడంతో చినమిడిసిలేరు, పెదమిడిసిలేరు, తిప్పాపురం, ఉయ్యాలమడుగు, గొరుకొండ తదితర గ్రామాలకు చెందిన గిరిజనులు ఆటోలలోనే వారి ప్రయాణాలు సాగిస్తుండగా..

ఆదివారం వారపు సంతకు వచ్చిన గిరిజనులు ఇలా ఆటోలో బయట వైపునకు వచ్చేలా ప్రయాణం సాగించారు. ఈ సందర్భంలో సాక్షి క్లిక్ మనిపించింది.